క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ శ్రీను

బొబ్బిలి: మండల తహసీల్దార్‌గా ఎం.శ్రీను శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లాలోని, గార మండల తహసీల్దార్‌గా పనిచేసి, బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పక్కాగా పశుగణన చేపట్టాలి


పశుగణన చేస్తున్న గ్రామ పశు సంవర్ధక శాఖ సహాయకురాలు

తెర్లాం: పశుగణన పక్కాగా చేపట్టాలని మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ సూచించారు. మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలో గ్రామ సచివాలయ పశుసంవర్ధక సహాయకులు శనివారం చేసిన పశుగణనను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి, ఎవరెవరికి ఎన్నెన్ని పాడిపశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు ఎనెన్ని ఉన్నాయనే వివరాలు నమోదు చేయాలని తెలిపారు. సిబ్బంది చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి వివరాలు రాబట్టాలన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

రేగిడి: మండలంలోని అంబకండి, ఉంగరాడ మెట్ట ప్రాంతాల్లోని ఎరువుల దుకాణాల్లో ఏవో జి.మురళీకృష్ణ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా చోట్ల విక్రయిస్తున్న యూరియా, డీఏపీ వివరాలను రికార్డులను చూసి, పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకే రైతులకు ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు


బూరాడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

రేగిడి: మండలంలోని బూరాడ జంక్షన్ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు శనివారం ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు హెచ్చరించారు. రోడ్డు మలుపులు గమనిస్తూ పరిమిత వేగంతో వాహనాలు నడపాలన్నారు.

న్యాయ అవగాహన సదస్సు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ

బొబ్బిలి: స్థానిక బీసీ బాలికల వసతిగృహంలో న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ బాలల హక్కులు, మహిళల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. మనతో సన్నిహితంగా ఉన్న వారి ప్రవర్తనలో ఆకస్మాత్తుగా ఏదైనా తేడాలు వస్తే వెంటనే అప్రమత్తమై వారి నుంచి దూరంగా జరగాలని తెలిపారు. అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించి, న్యాయం పొందాలన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ


రాజాం: మొక్కలతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

తెర్లాం: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంఈవో జె.త్రినాధరావు అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కూనాయవలస ప్రాథమికోన్నత పాఠశాలలో పచ్చదనం–పరిశుభ్రత కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఎంఈవో, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ పచ్చని మొక్కలు ప్రగతికి మెట్లని, మొక్కల పెంపకానికి ప్రతిఒక్కరూ ముందుకురావాలని కోరారు. అందరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు.

రాజాం: స్థానిక పోలీస్‌స్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటినట్లు ఎంఈవోలు బి.ప్రవీణ్‌కుమార్, వై.దుర్గారావు తెలిపారు. రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి 10 మొక్కలు ఇవ్వగా, పాఠశాలలోని వంద మంది విద్యార్థులు వంద మొక్కలు తీసుకువచ్చి, పాఠశాల మైదానంలో నాటారన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, మానవ మనుగడను కాపాడాలని హితవుపలికారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సంతకవిటి: మొక్కలు నాటుతున్న సిబ్బంది

బొబ్బిలి: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్థానిక పట్టణంలో పలు ప్రభుత్వ పాఠశాలల సిబ్బందికి గ్రీన్‌బెల్ట్ సొసైటీ వ్యవస్థాపకుడు ఎస్.వి.రమణమూర్తి మొక్కలు అందజేసి, వారితో వారి పాఠశాలల్లో మొక్కలు నాటించారు.


తెర్లాం: మొక్కలు నాటుతున్న ఎంఈవో త్రినాధరావు


బొబ్బిలి: మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సంతకవిటి: మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడండి, కాలుష్యాన్ని నివారించండి అని సిరిపురం పాఠశాల హెచ్ఎం వి.వెంకటరావు పిలుపునిచ్చారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షితః అని అన్నారు. మొక్కలను మనం కాపాడితే అవి మనల్ని కాపాడుతాయని అర్థం వివరించారు.

రేగిడి: శిక్షా సప్తాహ్‌లో భాగంగా మండలంలోని సంకిలి పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

రాజాం సిటీ: మండలంలోని వీఆర్‌అగ్రహారం ఎంపీపీ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు

- జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్


మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

తెర్లాం: నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలకు వెనుకాడేది లేదని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శనానంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన.. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలని, అవి ఉన్నవీ, లేనివీ ఎంఈవోలతో పరిశీలన చేయించి నివేదిక తెప్పించుకుంటామన్నారు. జిల్లాలో ఈ ఏడాది 1,22,198 స్టూడెంట్ కిట్స్‌కు గాను ఇంతవరకు 1,10,000 వేల మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులకు బూట్లు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మనబడి నాడు–నేడు కింద పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు 80 శాతం మేర పూర్తయ్యాయన్నారు. పీఎం పోషణ గోరుముద్ద పథకాన్ని సక్రమంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన చేసేలా ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నామన్నారు. అంతకుముందు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పాఠశాల విద్యాప్రమాణాలు పరిశీలించి, అంచనా వేశారు. బోధనలో మెలకువలు పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు డీఈవో సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఈవో మోహన్‌రావు, ఎంఈవోలు త్రినాధరావు, పాపారావు, ప్రధానోపాధ్యాయుడు రమేష్ ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

- సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ సూచించారు. స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో పలు అంశాలపై న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమని, సన్మార్గంలో పయనించి ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఫ్యాషన్ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ద్విచక్రవాహనాన్ని హెల్మెట్ లేకుండా నడుపుతూ ప్రమాదాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే యువత ఎక్కువగా మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితం నాశనం చేసుకుంటున్నారన్నారు. చెడుస్నేహం చేయరాదని, జూనియర్లను ర్యాగింగ్ చేస్తే కళాశాలల నుంచి బహిష్కరిస్తామన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారంతా శిక్షార్హులేనన్నారు. సత్ప్రవర్తనతో మంచి విద్యాబుద్ధులు నేర్చుకుని, ఉత్తమ వ్యక్తులుగా వెలుగొందాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కుమారి, ఎస్ఐ ఎస్.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమరావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆర్ ఈసీహెచ్ జయదేవ్, ఎం.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ అధ్యక్షులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్య, ఏఎంసీ ఫౌండేషన్ సభ్యుడు ఎ.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

రాజాం సిటీ: చిన్నతనం నుంచే ప్రతీ విద్యార్థి నైతిక విలువలు పెంపొందించుకోవాలని మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ రోడ్డు పాఠశాలలో విద్యార్థులకు నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై శనివారం అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవిత చరిత్రను వివరించి, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు తెలుసుకుని, ఆదర్శంగా జీవించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం వేలం

రాజాం సిటీ: స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద శనివారం నిర్వహించిన పీడీఎస్ బియ్యం వేలం పాటలో రూ.66,500లకు మండల పరిధిలోని కొఠారిపురానికి చెందిన తాడ్డి శిమ్మయ్య వేలం దక్కించుకున్నట్లు సీఎస్‌డీటీ ఎస్.చిరంజీవిరావు తెలిపారు. కిలో రూ.35 చొప్పున మొత్తం 19 క్వింటాళ్ల బియ్యాన్ని వేలం వేయగా, రాజాం, సంతకవిటి, చీపురుపల్లి మండలాల నుంచి ఏడుగురు పాటదారులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో చీపురుపల్లి, గరివిడి సీఎస్‌డీటీలు రామారావు, సీహెచ్ శోభారాణి, గొడౌన్ ఇన్‌చార్జి గంగాభవాని పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

రాజాం సిటీ: వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని కిశోరి బాలికలకు అంగన్‌వాడీ కార్యకర్త ఎం.శ్రీదేవి సూచించారు. శనివారం స్థానిక పట్టణంలోని మల్లికార్జునకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో 11 నుంచి 18 ఏళ్లలోపు బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రుతుస్రావం జరిగే సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోతే రోగాల బారినపడే ప్రమాదం ఉందన్నారు. అనంతరం బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. 18 ఏళ్లలోపు బాలికలకు పెళ్లిళ్లు చేయడం వల్ల పుట్టే పిల్లల్లో అంగవైకల్యం, రక్తహీనత, పెరగకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ ఇందిర, ఆయా రమణమ్మ, బాలికలు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై శనివారం అవగాహన కల్పించారు. రుతుస్రావం జరిగే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, పరిశుభ్రతా చర్యలు పాటించాలని అంగన్‌వాడీ సిబ్బంది తెలిపారు.

విద్యాసామగ్రి వితరణ

రేగిడి: మండలంలోని కొమెర గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి పప్పుల దినేష్‌కుమార్ నోటుపుస్తకాలు, పెన్నులు, కథల పుస్తకాల(విద్యాసామగ్రి)ను శనివారం వితరణ చేశారు. అంతకుముందు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించి, కలాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బి.రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు


జేసీబీ సాయంతో అక్రమ నిర్మాణం తొలగిస్తున్న అధికారులు

తెర్లాం: మండల కేంద్రంలోని దాసరిబందకు సాగు నీరు తీసుకువెళ్లే కాలువపై అక్రమంగా చేపట్టిన నిర్మాణాన్ని తొలగించినట్లు ఎంపీడీవో బి.మధుసూదనరావు శనివారం తెలిపారు. చింతల వెంకటేష్ అనే వ్యక్తి కాలువపై నిర్మించిన అక్రమ నిర్మాణం కారణంగా సాగునీరు సరిగా రావడం లేదని రైతులు తనకు, తహసీల్దార్‌కు, ఇరిగేషన్ అధికారులకు, బొబ్బిలి ఆర్‌డీవోకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై ఫోర్‌మన్ కమిటీ కూడా వేశామని, ఈ కమిటీలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ హరి, పీఆర్ ఏఈ రాజశేఖర్, పంచాయతీ ఈవో సూరిబాబు ఉన్నారన్నారు. వీరంతా కాలువపై నిర్మించిన కట్టడాన్ని పరిశీలించి, అది అక్రమ కట్టడమని గుర్తించి, సంబంధిత వ్యక్తికి నోటీసులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. అతడు స్పందించకపోవడంతోనే ఫోర్‌మన్ కమిటీ సిఫార్సుల మేరకు అక్రమ నిర్మాణాన్ని జేసీబీతో తొలగించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రూప, ఎంపీటీసీ ఆనందరావు, మాజీ ఎంపీపీ ప్రతినిధి ఎస్.వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఎస్.వెంకటనాయుడు, పోలీసులు పాల్గొన్నారు.

గంగయ్య సేవలు మరువలేనివి


గంగయ్య విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు

బొబ్బిలి: మున్సిపాలిటీ అభివృద్ధికి ఆరి గంగయ్య చేసిన సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. ఆయన 38వ వర్ధంతి పురస్కరించుకుని, స్థానిక పాతబస్టాండ్‌లోని ఆరి గంగయ్య మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి, శనివారం నివాళులర్పించారు. అనంతరం ఆయన మొట్టమొదటి మున్సిపల్ చైర్మన్‌గా మున్సిపాలిటీ సర్వతోముఖాభివృద్ధికి చేపట్టిన సంస్కరణలు వివరించారు. కార్యక్రమంలో తెలగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చనమల్ల ప్రసాదరావు, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రామ్మూర్తినాయుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు


మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని, ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలకు వెనుకాడేది లేదని సీఐ తిరుమలరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో శనివారం మాట్లాడిన ఆయన.. గ్రామాల్లో శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. రామభద్రపురం అంతర్‌రాష్ట్ర కూడలి కావడంతో మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక నిఘా వేశామన్నారు. రాత్రిళ్లు పోలీసులతో వీధుల్లో రౌండ్‌లు వేయిస్తున్నామన్నారు. అలాగే గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట ఎస్ఐ జ్ఞానప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం


నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎం ఆనంద్

రామభద్రపురం: నవధాన్యాల సాగుతో నేల సారవంతమై పంటలు బాగా పండుతాయని డీపీఎం ఆనంద్ అన్నారు. మండలంలోని గొల్లపేటలో పలువురు చేస్తున్న నవధాన్యాల సాగును ఆయన శనివారం పరిశీంచారు. అనంతరం నవధాన్యాల సాగు ప్రయోజనాలను రైతులకు వివరించారు. నవధాన్యాల సాగుతో భూమిలో కర్బన శాతం పెరుగుతుందని, నేలగుళ్లబారి నీటిని నిలువ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఇదే నేలలో పెరిగే వానపాములతో భూసారం పెరుగుతుందన్నారు. నవధాన్యాల మొక్కల వేళ్ల ద్వారా వివిధ రకాల స్రావాలు విడుదలై భూమిలోని హానికరమైన నేమిట్యాడ్స్‌ను నిర్మూలిస్తాయన్నారు. చిరుధాన్యాల సాగుపై కూడా రైతులు దృష్టిసారించాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ పి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాథపురంలోని గంగయ్య వ్యవసాయ క్షేత్రంలో నవధాన్యాల మొలకశాతాన్ని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆనందరావు శనివారం పరిశీలించారు. మొక్కల మొలకశాతం, ఎదుగుదలతో పాటు వానపాముల అభివృద్ధి కూడా బాగుందన్నారు. ఆయన వెంట అదనపు జిల్లా మేనేజర్ స్వామినాయుడు తదితరులు ఉన్నారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం


రాజాం సిటీ: కలాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న మానవతా సంస్థ సభ్యులు


తెర్లాం: గ్రంథాలయంలో అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

రాజాం సిటీ: రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా దేశానికి ఏపీజే అబ్దుల్ కలాం చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. స్థానిక వెంకట సూర్యదుర్గ కల్యాణ మండపం ఆవరణలో కలాం వర్ధంతి శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, మానవతా సంస్థ అధ్యక్షులు బీవీ అచ్యుత్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవి తదితరులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆయన చూపిన ప్రతిభతో దేశ ఖ్యాతి పెరిగిందన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని, నేటి యువత జీవనం సాగించాలని కోరారు.

తెర్లాం: విద్యార్థులంతా భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని వెలగవలస హైస్కూల్ హెచ్ఎం రాజు, లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి వారు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు విద్యార్థులనుద్దేశించి కాసేపు మాట్లాడారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి కలాం ఎనలేని సేవలు అందించారని, ప్రతీ విద్యార్థి ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రతిఒక్కరూ కలాం జీవిత చరిత్రను చదివి స్ఫూర్తిని పొందాలన్నారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి

బొబ్బిలి: ఈపీఎఫ్ఎస్(ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్) పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.శేషగిరిరావు, పొట్నూరు శంకరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్ సాధనకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆగస్టు 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు చేపట్టనున్న ధర్నాకు సంబంధించి, స్థానిక పట్టణంలో శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. దేశంలోని 75 లక్షల మంది పెన్షనర్లలో 25 లక్షల మందికి రూ.వెయ్యి లోపే నెలవారీ పెన్షన్ అందుతోందని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి, ఈపీఎఫ్ఎస్ లబ్ధిదారుల పెన్షన్ పెంచేందుకు జీవో జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భుజంగరావు, పి.కృష్ణ, జి.రామారావు పాల్గొన్నారు.

ఓడీఎఫ్ సర్వే

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాథపురంలో ఓడీఎఫ్ సర్వే శనివారం చేపట్టారు. సర్వే పక్కాగా నిర్వహించి, సమాచారం సేకరించాలని ఎంపీడీవో పోతుల రవికుమార్ సిబ్బందికి సూచించారు.

కేంద్ర బడ్జెట్‌పై చర్చాగోష్ఠి

బొబ్బిలి: స్థానిక ఇందిరాగాంధీ కళాశాలలో కేంద్ర బడ్జెట్‌పై చర్చాగోష్ఠి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి బడ్జెట్‌లో వివిధ రంగాలకు కేటాయించిన నిధులు, వాటి వివరాలను తెలియజేశారు. కేంద్రం చేసిన అప్పులకే 19 శాతం నిధులు కేటాయించారంటే అప్పు ఎంత ఉందో అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకర రావు, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి


రేగిడి: వన్నలిలో లైన్ సోయింగ్ విధానంలో వరినాట్లు వేస్తున్న దృశ్యం

రేగిడి: వరినాట్లు వేసుకునేటప్పుడు కాలిబాటలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని రైతులకు ఏఈవో విజయలక్ష్మి సూచించారు. మండలంలోని వావిలవలస, లింగాలవలస గ్రామాల్లో వేసిన వరినాట్లను ఆమె శనివారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. కాలిబాటలు వేసుకోవడం వల్ల పంటకు ఎరువులు వేయడం సులభమవ్వడంతో పాటు పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి పంట ఏపుగా పెరుగుతుందన్నారు.

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో రైతు సునీల్‌కుమార్ తన పొలంలో ప్రకృతి వ్యవసాయ విధానంలోని లైన్ సోయింగ్ పద్ధతిలో వరినాట్లు వేశారు. ఈ విధానం అవలంభిస్తే పంట బాగా పెరిగి, అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, జి.రమణ, వీఏఏ శ్రీనివాసరావు తెలిపారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని కారాడ, అలజంగి, గోపాలరాయుడిపేట, మెట్టవలస, పెంట గ్రామాల్లోని పొలాలకు అగ్రికల్చర్ అసిస్టెంట్లు వెళ్లి, వరినాట్లు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. వరి నారును తొలుత సూడోమోనాస్ ద్రావణంలో ముంచి శుద్ధి చేసుకోవాలని, ఆ తర్వాత నారు చివర్లు తొలగించి నాటుకోవాలని తెలిపారు. ఇలా చేయడం ద్వారా పంట బాగా పండి, అధిక దిగుబడులు వస్తాయన్నారు.

వంగర: మండలంలోని తలగాం గ్రామంలో వరినాట్లు వేసేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. నారు తీసిన తర్వాత దానిని సూడోమోనాస్ ద్రావణంలో ముంచి శుద్ధి చేసుకోవాలని, ఇలా చేయడం ద్వారా మొక్కకు పట్టే పురుగు నశిస్తుందని, అలాగే నాట్లు వేసేముందు నారు చివర్లు తొలగించి, నాటుకోవాలని వీఏఏ మధు తెలిపారు.